సాక్షి అనంతపురం

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

31.9°/13.3°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

ఉద్యోగ కల్పనే లక్ష్యం

జాబ్‌మేళాలో 311 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం: డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించడమే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని కేఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాబ్‌మేళా నిర్వహించింది. 794 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మథూట్ ఫైనాన్స్, ఆల్‌సెక్ టెక్నాలజీస్, కోజెంట్, కెరీర్ ల్యాబ్స్, వికాస్ (హుండాయ్ మెబైల్స్), కేఐఎంఎల్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, హెల్ప్ యువర్ నీడ్స్, డిజిటల్ మార్కెటింగ్, ఫ్యామిలీ హెల్త్‌కేర్, యంగ్ ఇండియా, మెడ్‌ప్లస్ ఫార్మసీ, కిమ్స్ సవీరా హాస్పిటల్, లేపాక్షి కూలింగ్ సొల్యూషన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, వినూత్న ఫర్టిలైజర్స్, ఈనాడు, ఫూజిలోనా కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 311 మందికి కొలువులు దక్కాయి. మరో 52మంది అభ్యర్థులు ఫైనల్ రౌండ్‌కు చేరుకున్నారు. వీరికి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం ద్వారా అనంతలో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆనంద్ రాజకుమార్, కేఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య, ఉద్యోగ కల్పనాధికారి కళ్యాణి పాల్గొన్నారు.

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఎస్కేయూ వీసీ, ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభిస్తారు. తొలి మ్యాచ్ సీనియర్ విభాగంలో పీవీకేకే డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరుగుతుంది.

సమగ్రశిక్ష ఏపీసీ తిలక్ విద్యాసాగర్ బదిలీ



అనంతపురం: సమగ్రశిక్ష అనంతపురం ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్) కె.తిలక్ విద్యాసాగర్‌ను మాతృశాఖకు బదిలీ చేశారు. కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన 2020 ఆగస్టులో అనంతపురం సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. తనను రిలీవ్ చేయాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు రెండు నెలల కిందట విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో తిలక్ విద్యాసాగర్‌ను రిలీవ్ చేయాలని రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ ఆమోదం రాగానే తిలక్ విద్యాసాగర్ బోటనీ లెక్చరర్‌గా విధులు నిర్వహించనున్నారు. సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు ఎవరికి వాలని ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్యకు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గరుడ వాహనంపై కొండమీద రాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామివారిని గరుడాద్రి (బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గరుడ వాహనంపై ఊరేగించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రాహ్మణ సంఘం నాయకులు శివకుమార్, సూర్యనారాయణ, శ్యామలమ్మ, శివరాం పాల్గొన్నారు.

ఆయకట్టు కళకళ

భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) ఆయకట్టు భూములు నాలుగేళ్ల క్రితం వరకు బీడువడ్డాయి. నాటిటీడీపీ పాలనలో సాగునీటి వసతి లేక ఆయకట్టుదారులు పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం వలస వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. భూగర్భజలాలు కూడా 5.64 మీటర్ల ఎత్తుకు పెరగడంతో ఒట్టిపోయిన వ్యవసాయ బోర్ల నుంచి నీరు ఉబికి వస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు తిరిగి వ్యవసాయం మొదలుపెట్టారు. ఆయకట్టుతో పాటు బోర్ల కింద పంటలు సాగులోకి రావడంతో ఎటు చూసినా పచ్చగా కళకళలాడుతోంది.



బీటీపీ ఆయకట్టులో మొదలైన వరి నాట్లు



వరద నీటితో తొణికిసలాడుతున్న బీటీపీ ప్రాజెక్ట్

- తొణికిసలాడుతున్న బీటీపీ
- వరుసగా రెండోసారి ఆయకట్టుకు నీరు
- పెరిగిన భూగర్భజలాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు



బోరులో ఉబికి వస్తున్న భూగర్భ జలం

రాయదుర్గం: బీటీపీ ఆయకట్టుకు మహర్దశ పట్టింది. నాలుగేళ్ల క్రితం వరకు కంపచెట్లకు పరిమితమైన భూములన్నీ సాగులోకొచ్చాయి. వరుసగా రెండో ఏడాది ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో వ్యవసాయం పండుగలా మారింది. గుమ్మఘట్ట మండలంలోని భైరవానితిప్ప గ్రామం వద్ద 1954లో వేదావతి నదిపై రూ.1.5 కోట్ల వ్యయంతో 2.5 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి, 1961లో పూర్తిచేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో 12,500 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి సాగునీరందించేలా రూపకల్పన చేశారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) పరిధిలో రైతులు మాత్రమే రొటేషన్ పద్ధతిలో సాగునీటిని వినియోగిస్తున్నారు. 1980 వరకు రబీ, ఖరీఫ్‌లో రెండు పంటలకు సమృద్ధిగా నీటిని వినియోగించుకున్నారు. క్యాచ్‌మెంట్ ప్రాంతమైన కర్ణాటకలో నది జలాలను అడ్డుకునేలా బ్యారేజీలు నిర్మించడం, వర్షాభావ పరిస్థితులు వెంటాడడం లాంటి కారణాలు వెరసి ఐదేళ్లకోసారి కూడా రిజర్వాయర్ నిండని దుస్థితి చేరింది.

మళ్లీ పూర్వవైభవం..

2014–2019 మధ్య ఒకసారి రిజర్వాయర్‌కు నీళ్లొచ్చాయి. అప్పట్లో ఎడమ కాలువ పరిధిలోని గుమ్మఘట్ట మండలంలోని 9, 10, 10ఏ, 11, 12, 13, 14వ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 3,253 ఎకరాలకు నీటిని విడుదల చేశారు. చివర్లో సక్రమంగా నీటి తడులు అందక చివరి ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. 2019 నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. 2020లో రిజర్వాయర్‌లోకి కొద్దిపాటిగా చేరిన వరద నీరు 2021లో పూర్తిస్థాయికి చేరుకున్నాయి. దీంతో గుమ్మఘట్ట మండలంలోని 15వ డిస్ట్రిబ్యూటరీ నుంచి భూపసముద్రం తిప్పన్న తూము వరకు 2,100 ఎకరాలు, బ్రహ్మసముద్రం మండలంలోని కుడికాలువ ద్వారా 1 నుంచి 6ఏ డిస్ట్రిబ్యూటరీ వరకు 1,820 ఎకరాలకు ఆ ఏడాదిలో సాగునీరందించారు.

రికార్డు స్థాయిలో దిగువకు వరద..

2022 సంవత్సరంలో ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాలు కుమ్మేశాయి. వాగులు, వంకలు, చెరువులన్నీ మరువపారాయి. బీటీపీప్రాజెక్ట్ నుంచి సుమారు 142 రోజుల పాటు గేట్లు తెరిచి రికార్డు స్థాయిలో 65 టీఎంసీల నీటిని దిగువకు వేదావతి హగరి ద్వారా వదలాల్సి వచ్చింది. ప్రస్తుత ఏడాది కూడా కుడి, ఎడమ కాలువ ద్వారా 5,430 ఎకరాల ఆయకట్టుకు నీటిని వదులుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 'ఆయకట్టులో భూములన్నీ బీళ్లు' ఉన్నట్లు దుష్ప్రచారం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తిపోతలపై టీడీపీ ఉత్తి మాటలే!

హంద్రీ–నీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణా జలాలను బీటీపీకి మళ్లించేలా టీడీపీ హయాంలో అమల్లోకి తెచ్చిన ఎత్తిపోతల పథకం చివరకు ఉత్తి మాటలుగానే మిగిలిపోయింది. నిధుల మంజూరుకు పాలనాపరమైన అనుమతులు వచ్చాయని ఆర్భాటంగా సంబరాలు చేసుకున్న టీడీపీ పాలకులు ఆచరణ సమకూర్చడంలో మాత్రం ఘోరంగా వైఫల్యం చెందారు. కాలువ తవ్వకానికి భూసేకరణ చేపట్టి రైతులకు పరిహారం కూడా అందించకుండా అభాసుపాలయ్యారు. ప్రభుత్వ భూముల్లో మాత్రమే తవ్వకాలు చేపట్టి చేతులు దులిపేసుకున్నారు. మళ్లీ ఈ పథకమును ఓ వర్గం మీడియా ద్వారా తెరపైకి తెచ్చేలా టీడీపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారు. ఏది నిజమో.. ఏది అబద్ధమో తమకు బాగా తెలుసని రైతులు అంటున్నారు.

సాగునీరు పుష్కలం



బీటీపీ ఆయకట్టు పొలాలకు పుష్కలంగా సాగునీరందిస్తున్నారు. రైతుల డిమాండ్ మేరకు నీటిని విడిచి ఆయకట్టుకు సమకూర్చారు. కొన్ని చోట్ల వరి నాట్లు మొదలుకాగా, మరికొన్ని చోట్ల ఆరు తడి పంటలు సాగులోకి వచ్చాయి. వరుసగా రెండో ఏడాది కూడా పంటలకు నీటిని విడుదల చేయడంతో భూములన్నీ సాగులోకి వచ్చాయి.

– వెంకటరమణ, ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

బోర్లు రీఛార్జ్ అయ్యాయి



వేదావతి హగరి పరివాహక ప్రాంతంలో నాకు పొలం ఉంది. నాలుగేళ్ల క్రితం సరైన వర్షాలు లేక బోర్లలో నీరు అడుగంటాయి. రూ.లక్షలు ఖర్చుచేసి ఐదు బోర్లు తవ్వించినా నీరు పడలేదు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాల్లేక పెంపకం చేపట్టడంతో పాటు ఎద్దుల బండ్లపై లారీలకు కొట్టే పనులకు వెళ్లేవాళ్లను. మూడేళ్లుగా వర్షాలు మెండయ్యాయి. ఈ ఏడాది హగరి నది ఉధృతంగా దాల్చింది. నీటి కోసం నేను తవ్వించిన బోర్లన్నీ రీఛార్జ్ అయ్యాయి. వ్యవసాయం పండుగలా మారింది.

– కమ్మరి హనుమంతు, రైతు, కలుగోడు

సమృద్ధిగా వర్షాలు



బీటీపీప్రాజెక్ట్‌ తో పాటు మెజార్టీ చెరువులన్నీ వరద నీటితో కళకళలాడాయి. కరువును పారదోలేలా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఆయకట్టు సైతం విస్తరించడంతో రైతుకు చేతినిండా పని లభించింది. ఆనాటి కరువును తలిస్తేనే భయమేస్తోంది. నేడు సుభిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడుగా నిలవడంతో రైతాంగం మెరుగుపడుస్థితికి చేరింది.

– అశ్వత్థరెడ్డి, రైతు, జి.వెంకటంపల్లి

రెండోసారి సాగుకు సిద్ధం



గతేడాది మూడు ఎకరాల్లో వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించాను. ఈ ఏడాది కూడా నీరు రావడంతో అదే మాదిరాల్లో పంట సాగుకు సిద్ధం చేశాను. వరితో పాటు కొంత ఆరుతడి పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. ఆయకట్టుదారులంతా పంటల సాగు చేపట్టారు.

– నన్నపుయ్య, రైతు, రంగచేడు

ఆధార్ నవీకరణ తప్పనిసరి



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: జిల్లాలో 2010 నుంచి 2016 మధ్య, ఆ తర్వాత ఆధార్ కార్డు పొందిన వారు ప్రతి పదేళ్లకోసారి నవీకరణ (అప్‌డేట్) తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గాయత్రీదేవి స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి నవీకరించుకునేలా చైతన్యపర్చాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, నవీకరణ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుట్టిన పిల్లలకు ఆధార్ పొందేలా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని, విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందని, ఆ తరువాత అప్‌డేట్‌కు రుసుం వసూలు చేస్తారన్నారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబరు 1947 లేదా help@uidai.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్‌డేట్‌తోనే సంక్షేమ ఫలాలు

అనంతపురం సిటీ: ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటేనే భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు పొందేందుకు వీలవుతుందని జిల్లా పరిషత్ సీఈఓ, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీఆర్‌డీసీలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ) లింక్‌వారు ఓబుళమ్మ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా సీఈఓ మాట్లాడారు. ఒకే దేశం –ఒకే రేషన్ కింద లబ్ధిదారులు ఎక్కడి నుంచైనా రేషన్ పొందే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే కచ్చితంగా ఆధార్ అప్‌డేట్ అయి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోనూ ఆధార్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ శంకర్, ఏపీఎం జావీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బంగారు బాట

- ఒకటో తరగతి నుంచి పీజీ వరకు అమ్మ ఒడి, విద్యా దీవెన
- విదేశీ విద్యాదీవెన ద్వారా మరింత ప్రోత్సాహం
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



విదేశీ విద్యాదీవెన మెగా చెక్కు విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: 'పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉంది అంటే.. అది చదువు ఒక్కటే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ చెబుతుంటారు. అందుకు అనుగుణంగానే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారు' అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. విదేశీ విద్యా దీవెన పథకం కింద ఎంపికైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద మొదటి విడత నగదును సీఎం శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ వీసీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పాల్గొని మొదటి విడత కింద ఇద్దరు విద్యార్థులకు మంజూరైన రూ.31,68,147 మెగా చెక్కును విడుదల చేశారు. విప్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అమ్మఒడి ద్వారా తోడ్పాటునందిస్తున్నారన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన ద్వారా సాయం అందిస్తున్నారు. విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రోత్సాహం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నస్థాయికి ఎదిగి దేశానికి గొప్ప ఆస్తిగా తయారు కావాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా విదేశాల్లోని 200 టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య అభ్యసించే అవకాశం కల్పిస్తోందన్నారు. జిల్లాలో ఈ ఏడాది అర్హత ఉన్న ఇద్దరు విద్యార్థులు పథకం కింద ఎంపికయ్యారన్నారు. ఈబీసీ కింద ఒకరికి రూ.72,84,480 ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనారిటీ వర్గానికి చెందిన ఒకరికి రూ.50,76,108 ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసిందన్నారు. ఇందులో మొదటి విడత కింద ఈబీసీ విద్యార్థిని గుండం సాయి తనిష్కకు రూ.18,21,120, మైనారిటీ విద్యార్థి మహమ్మద్ నూరుల్లాకు రూ.13,47,027 మంజూరు చేశారన్నారు. ఇలా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ విదేశీ విద్యాదీవెన పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలో విదేశీ విద్యాదీవెన కింద అర్హులైన వారు నవీనంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హరిత, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్.ఉమాదేవి, సీడ్యాప్ ఛైర్‌పర్సన్ మేదా రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాది మధ్యతరగతి కుటుంబం. మా బాబు నూరుల్లా జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంఎస్ (సివిల్ ఇంజినీరింగ్) చేస్తున్నాడు. విదేశీ విద్యాదీవెన పథకం కింద మా అబ్బాయి చదువుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.50.76 లక్షలు మంజూరు చేశారు. మొదటి విడత కింద రూ.13.47 లక్షలు ఇచ్చారు. ఇంత మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎం.షబానావలి

మధ్యతరగతి వారికి గొప్పవరం



మాలాంటి మధ్యతరగతి కుటుంబాల్లోని పిల్లలు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన విదేశీ విద్యాదీవెన పథకం గొప్ప వరం. మా అమ్మాయి సాయి తనిష్క కొలంబియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్ (బిజినెస్ ఎనలిటిక్స్) చేస్తోంది. విదేశీ విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.72.84 లక్షలు మంజూరు చేయడమే కాకుండా మొదటి విడత కింద రూ.18.21 లక్షలు ఇచ్చారు.

– ప్రసన్న

ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకోండి

యల్లనూరు/పుట్లూరు: ప్రతి రైతూ ఈ–క్రాప్, పీఎం కిసాన్ ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రా నాయక్ సూచించారు. శుక్రవారం యల్లనూరు మండలం నిట్టూరు, పుట్లూరు మండలం శనగలగూడూరు రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఏఓ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల గురించి వ్యవసాయ సిబ్బందికి తెలిపితే.. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఈ–క్రాప్ నమోదు ఆధారంగానే పథకాలు వర్తిస్తాయని, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రామకృష్ణ, కాత్యాయని, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

విడపనకల్లు ఎంపీపీగా పుష్పావతి ఏకగ్రీవం



ఎంపీపీ పుష్పావతికి డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

విడపనకల్లు: మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ)గా కరణం పుష్పావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ ఇదివరకు ఎంపీపీగా ఉన్న బోయ నాగలక్ష్మి తన పదవికి రాజీనామా చేసింది. దీంతో ఖాళీపడ్డ ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి అంజుమన్ షఫీన్ శుక్రవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. కరణం పుష్పావతిని ఎంపీపీ అభ్యర్థిగా గడేకల్లు ఎంపీటీసీ–2 ఓబులేశు, వి.కొత్తకోట ఎంపీటీసీ తిమ్మరాజు ప్రతిపాదించారు. మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 14 మంది వైఎస్సార్‌సీపీ, ఒకరు టీడీపీ వారు ఉన్నారు. స్వపక్ష ఎంపీటీసీలందరూ మద్దతు తెలపడంతో ఎంపీపీగా పుష్పావతి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం ఎన్నికల అధికారి అభ్యర్థితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉరవకొండ ఎంపీపీ చంద్ర చంద్రమ్మ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ బోయ సుశీలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీతా రాజే, సచివాలయ జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, ప్రమాణ స్వీకారానికి హాజరై ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు నూతన ఎంపీపీకి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ బ్రహ్మయ్య ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

పాత రైల్వే ప్రాజెక్టులకే నిధులు

- గత ఏడాది కన్నా ఈసారి మరీ తక్కువ
- కొత్త ప్రాజెక్టులు, రైళ్లకు అనుమతులు లేవు

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు గత ఏడాదికన్నా తక్కువ నిధులు కేటాయించారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ పూర్తి వివరాలను శుక్రవారం సాయంత్రం డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి మీడియాకు వెల్లడించారు. నిర్మాణ దశలో ఉన్న పాత ప్రాజెక్టులకు మాత్రమే నిధులు కేటాయించారు. కొత్త ప్రాజెక్టులు, రైళ్లకు ఏమాత్రం అనుమతులు ఇవ్వలేదు. ఇచ్చిన నిధులతో పాత ప్రాజెక్టుల్లో కొన్నయినా పూర్తయ్యే పరిస్థితులూ కనిపించడం లేదు. నడికుడి – శ్రీకాళహస్తి కొత్తలైను, గుంతకల్లు – గుంతకల్లు, గుత్తి – ధర్మవరం డబ్లింగ్ లైన్లకు మాత్రమే కొంతమేర నిధులు దొరకడం హర్షణీయం. కడప – బెంగళూరు (వయా బంగారుపేట) మధ్య 255 కి.మీ నూతన రైలు మార్గం బాలారిష్టాలు దాటడం లేదు. ఈ ప్రాజెక్టుకు రూ.10 లక్షలు మాత్రమే కేటాయించడం డివిజన్ అధికారులను ఆశ్చర్యపరిచింది. అయితే ప్రయాణికుల భద్రతా చర్యల్లో భాగంగా రైలు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యమిస్తూ దాదాపు రూ.1,360 కోట్లు కేటాయించారు. ఇక గుంతకల్లులోని ఎలక్ట్రికల్ లోకోషెడ్‌కు రూ.5.6 కోట్ల నిధులను కేటాయించారు.

పాత ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు

ప్రాజెక్టు పేరు	2022	2023
నడికుడి–శ్రీకాళహస్తి న్యూలైన్	రూ.1501కోట్లు	రూ.202 కోట్లు
కడప – బెంగళూరు న్యూలైన్	రూ.289 కోట్లు	రూ.10 లక్షలు
గుంతకల్లు – గుంటూరు డబ్లింగ్	రూ.803 కోట్లు	రూ.980కోట్లు
గుత్తి – ధర్మవరం డబ్లింగ్	రూ.100 కోట్లు	రూ.90.6 కోట్లు
అంకోలా – డోన్ డబ్లింగ్	రూ. 5కోట్లు (సర్వేకు)	రూ.60 కోట్లు
మన్మాడ్ – కుడ్‌ఖేడ్ – డోన్ విద్యుదీకరణ	రూ.229 కోట్లు	రూ.315.6 కోట్లు
ధర్మవరం – పాకాల – కాట్పాడ్ డబ్లింగ్	---	రూ.40 కోట్లు

క్లుప్తంగా

రైతు అదృశ్యం



మజ్జిగ ఓబులేష్ (ఫైల్)

రాప్తాడు: ఆత్మకూరు మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన మజ్జిగ రామకృష్ణ కుమారుడు, యువ రైతు మజ్జిగ ఓబులేష్ అదృశ్యమయ్యాడు. బుధవారం ఉదయం మజ్జిగ ఓబులేష్ తోపుదుర్తి నుంచి రాప్తాడు మండలంలోని పాలచెర్ల సమీపంలో ఉన్న వ్యవసాయ తోట దగ్గరకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. రాత్రి 10 గంటలు అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా సెల్ స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల దగ్గర విచారించినా ఆచూకీ లభించలేదు. తదీంతో ఓబులేష్ తండ్రి రామకృష్ణ తన కుమారుడు కనిపించడం లేదని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని రాప్తాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మజ్జిగ ఓబులేష్ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే రాప్తాడు ఎస్‌ఐ సెల్ 9440796817కు సమాచారం ఇవ్వాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మర్తాడులో విరిగిపోయిన ధ్వజ స్తంభం

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడులో శుక్రవారం శివాలయం ముందర ధ్వజస్తంభం ప్రతిష్ఠ విరిగిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో తెల్లవారుజామున శివాలయం ముందు క్రేన్ సహాయంతో నూతనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేస్తుండగా ధ్వజస్తంభం మధ్య భాగం విరిగిపోయింది. అయితే ఆ సమయంలో భక్తులు దూరంగా ఉండడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నేటి నుంచి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టీ–20 టోర్నీని నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మధుసుధన్ నాయక్ తెలిపారు. అనంత క్రీడా మైదానం వేదికగా రెండు రోజుల పాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో ఆంధ్ర ఏ, ఆంధ్ర బీ జట్లు పాల్గొంటాయన్నారు. క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీటీ సీబీఆర్ డైరెక్టర్ దశరథ్, 45వ డివిజన్ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు అతిథులుగా హాజరవుతారన్నారు.

ముందుగా గుర్తిద్దాం.. క్యాన్సర్‌ను జయిద్దాం !

- ప్రాంతాల భేదం లేకుండా విస్తరిస్తున్న క్యాన్సర్
- ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో చెక్‌పెట్టొచ్చంటున్న వైద్యులు
- ఆరోగ్యశ్రీతో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

సందర్భం: నేడు అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది క్యాన్సర్ బారినపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతమని భేదం లేకుండా పలువురిని క్యాన్సర్ కబళిస్తోంది. ఈ వ్యాధి బారినపడి కుటుంబాలు ఆర్థికంగా సతమతమవుతున్నాయి. అయితే ముందస్తు పరీక్షలు, వైద్యం చేసుకోవడం ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు.



అనంతపురం సప్తగిరి సర్కిల్: క్యాన్సర్ అంటే కణం యొక్క అనియంత్రిత (నియంత్రణ లేని) విభజన వల్ల వచ్చిన ప్రాణాంతక పెరుగుదల. ప్రపంచం వ్యాప్తంగా ప్రతి ఏడాది కోటి మంది క్యాన్సర్ వల్ల మరణిస్తున్నారు. మరణాలలో క్యాన్సర్‌ది రెండో స్థానం. సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా 40 శాతం క్యాన్సర్‌లను రాకుండా నివారించవచ్చు. ముందస్తు పరీక్షలు, వైద్యం చేసుకోవడం ద్వారా 33.3 శాతం మరణాల రేటును తగ్గించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

క్యాన్సర్‌కు కారణాలు

మద్యపానం వల్ల రొమ్ము, నోరు, గొంతు, అన్నవాహిక, లివర్, కడుపు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే పొగాకును నమలడం, తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. చెడు ఆహారపు అలవాట్లు, శారీరక సోమరితనం వల్ల కూడా క్యాన్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే హెచ్‌పీవీ వైరస్, హైపటైటిస్ బీ, సీ వైరస్, ఈబీ వైరస్, ఒబిసిటీ ఉన్న వారిలో 12 రకాల క్యాన్సర్లు వస్తాయంటున్నారు. పర్యావరణంలోని రసాయనాలు, రేడియేషన్‌తో పాటు జన్యు కారణాలు, నాన్ మోడిఫైబుల్ రిస్క్ ఫ్యాక్టర్ల ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

నివారణ మార్గాలు

- ధూమపానం, మద్యపానం చేయకూడదు. మాంసాహారం మితంగా తీసుకోవాలి. నిల్వ ఉంచిన –మాంసాహారం, ప్రాసెస్డ్ మీట్ తీసుకోకూడదు.
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి.
- తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- శారీరక బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. అందుకు తగిన వ్యాయామం ఆహారపు అలవాట్లు పాటించాలి.

ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స



ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచితంగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తోంది. వైద్య చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోనే చికిత్స తీసుకునేలా ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తిరుపతి, విశాఖ, గుంటూరు–విజయవాడ మధ్య క్యాన్సర్ కేర్ హాస్పిటల్స్ నిర్మాణం, తిరుపతిలో చిన్నారులకు క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్యాన్సర్ కేసులు

సంవత్సరం	రేడియేషన్ ద్వారా చికిత్స	కిమో థెరపీ ద్వారా చికిత్స
2018	321	2057
2019	280	1760
2020	146	1130
2021	223	1968
2022	424	2050

ముందే గుర్తిస్తే మేలు



ప్రభుత్వ క్యాన్సర్ యూనిట్‌లో క్యాన్సర్‌కు సంబంధించి చికిత్సలను అందిస్తున్నాం. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రతి ఏడాది క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతోంది. తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. – డాక్టర్ ప్రశాంతి, క్యాన్సర్ యూనిట్, అనంతపురం

వ్యాక్సినేషన్‌తో ...

కొన్ని క్యాన్సర్ల వల్ల కలిగే అపాయాన్ని తగ్గించడానికి వ్యాక్సిన్లు సహాయపడతాయి. సర్వైకల్ క్యాన్సర్, యోని, వాల్వల్ క్యాన్సర్‌లు నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సహాయపడుతుంది. కాలేయ క్యాన్సర్‌కు దారితీసే హైపటైటిస్ బీని నిరోధించేందుకు హైపటైటిస్ బీ వ్యాక్సిన్ సహాయపడుతుంది. దాని ద్వారా కాలేయం క్యాన్సర్ (లివర్ క్యాన్సర్) ప్రమాదాన్ని తగ్గించొచ్చు.

సమస్యలు గుర్తించి సూచనలివ్వండి

- కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: గర్భిణుల్లో ప్రధాన సమస్యలైన రక్తహీనత, అధిక రక్తపోటు సమస్యలున్న వారిని ముందే గుర్తించి సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన మూడు మాతృ మరణాలు, మూడు శిశు మరణాలపై సమీక్షించారు. మరణాలకు సంబంధించిన నివేదికలను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సేవలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి, ప్రోగ్రాం అధికారులు చెన్నకేశవులు, సుజాత పాల్గొన్నారు.

పశుసంపద పరిరక్షణపై దృష్టి



సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నియోజక వర్గాల వెటర్నరీ ప్రయోగశాలల ద్వారా పశుసంపద, జీవసంపద పరిక్షణే ధ్యేయంగా పనిచేయాలని పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల అధికారులు వై.సుబ్రహ్మణ్యం, శుభదాస్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఉన్న జిల్లా స్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో ఏడీ ఎన్.రామచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచ్చిన 16 మంది టెక్నికల్ సిబ్బందికి ప్రతిభా అవార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రతి నియోజక వర్గ కేంద్రంలో వెటర్నరీ ల్యాబ్ ఉన్నందున ఎక్కడా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి ల్యాబ్‌లో ఉన్న వివిధ రకాల జబ్బులకు సంబంధించి వ్యాక్సినేషన్లు, కెమికల్స్, సామగ్రికి పరిశీలించి అవసరమైన మేరకు నియోజక వర్గాల ల్యాబ్‌లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఎస్‌లు డాక్టర్ పీజే శృతి, పి.ఉషా కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్ ఖాజా పీరా, 13 నియోజక వర్గాల వెటర్నరీ ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకారానికి ప్రభుత్వం పెద్దపీట

- 105వ వార్షికోత్సవంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, పాలకవర్గం సభ్యులు, అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: సంక్షోభంలో కూరుకుపోయిన సహకార వ్యవస్థకు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణంపోసి జవసత్వాలు నింపగా... తండ్రికి తగ్గ తనయుడుగా ఇంకా రెండడుగులు ముందుకేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మరింత సహకారం అందిస్తున్నారని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. సహకార బ్యాంకు 104 సంవత్సరాలు పూర్తి చేసుకుని 105వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక డీసీసీబీలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. డీసీసీబీ సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌తో పాటు మాజీ చైర్మన్ పామిడి వీరా, నాబార్డు డీడీఎం అనురాధ, ఎల్‌డీఎం బి.నాగరాజారెడ్డి, డీసీఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి, డీసీఏవో నాగరాజు, బ్యాంకు జీఎం కె.సురేఖారాణి, డీజీఎం డి.సుఖదేవబాబు, ఆప్కాబ్ డీజీఎం దినేష్‌కుమార్, బ్యాంకు డైరెక్టర్ వై.జనార్ధన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

నాలుగేళ్లలోనే రూ.500 కోట్ల వ్యాపారం

డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత మాట్లాడుతూ... 101వ వార్షికోత్సవ సమయంలో బ్యాంకు టర్నోవర్ రూ.1,000 కోట్లు ఉండగా... ఇప్పుడు 105వ వసంతంలోకి అడుగుపెట్టే నాటికి రూ.1500 కోట్ల మార్కును అధిగమించామన్నారు. నాలుగేళ్ల కాలంలోనే ఏకంగా రూ.500 కోట్లు టర్నోవర్ పెరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది ముగిసేనాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ చేరుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీల అభివృద్ధే ధ్యేయంగా రూ.20 కోట్లు షేర్ క్యాపిటల్ ఇవ్వడంతో పాటు అన్ని రకాలుగా సహకరిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించడానికి ఎంప్లాయీస్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే డిపాజిట్ల సేకరణలో డీసీసీబీ ప్రధాన కార్యాలయం, రుణాల మంజూరులో పుట్టపర్తి, మహిళా సంఘాలకు చేయూతను ఇవ్వడంలో కళ్యాణదుర్గం సహకార బ్యాంకులకు బెస్ట్ బ్యాంకుల కింద అవార్డులు ప్రకటించారు. అలాగే జూటూరు, రొళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు బెస్ట్ సొసైటీ కింద అవార్డులు ప్రదానం చేశారు.

నాయకత్వం లేని పార్టీ తెలుగుదేశం

- తమను పట్టించుకోలేదని పుట్లూరు, యల్లనూరు నాయకుల ఆగ్రహం



సమావేశమైన పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పుట్లూరు: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కనీస భరోసా కరువైందని, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలనే విషయం అర్థం కాక అయోమయంలో ఉన్నామని పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీ అధిష్టానం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని నాయకునిపల్లి బాట సుంకళమ్మ ఆలయం వద్ద పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు భరోసా కరువైందని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు నియోజకవర్గంలో ఉన్న ద్విసభ్య కమిటీ సభ్యులు, ఇన్‌చార్జ్‌లు స్పందించడం లేదన్నారు. ఈ రెండు మండలాల్లో టీడీపీకి అండగా జేసీ సోదరులు ఉండేవారన్నారు. అయితే ఇప్పుడు పుట్లూరు, యల్లనూరు మండలాలను పట్టించుకోవడంలేదని, తమను పట్టించుకునే ఇన్‌చార్జ్‌లను నియమించాలని డిమాండ్ చేశారు.

ఆధిపత్యం కోసమే..

పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు (జేసీ వర్గానికి చెందిన వారు) ఆధిపత్యం కోసమే సమావేశం పెట్టారని సమావేశానికి హాజరుకాని నాయకులు విమర్శిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్న రెండు మండలాల నాయకులను విస్మరించి సమావేశం నిర్వహించడం వల్ల పార్టీలో గందరగోళం సృష్టించడం మినహా ఎలాంటి ఫలితం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సైతం రెండు వర్గాలుగా ఉన్న నాయకులు గ్రామాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. ఎన్నికలు దగ్గర పడుతుంటంతో తాజాగా మరోసారి బల నిరూపణ ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

జకినీ మాతా పాహి.. పాహి



తలపై పూర్ణ కుంభాలు పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్న 108 మంది కన్యలు

- వైభవంగా ముగిసిన జాతర ఉత్సవాలు



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న ఆరె కటిక సంఘం సభ్యులు

గుత్తి: ఆరె కటికల ఆరాధ్య దైవమైన సునామ జకినీ మాత జాతర ఉత్సవాలు పట్టణంలో శుక్రవారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, గుంతకల్లు వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, గుత్తి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పద్మలతారెడ్డి, బిందె వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు దేశం నలు మూలల నుంచి వేలాదిగా ఆరె కటికలు తరలివచ్చి సునామ జకినీ మాత, మల్కుమని జకినీ మాతలను దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప ఆలయం వద్ద నుంచి సునామ జకినీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ప్రత్యేక వాహనం ముందు 108 మంది కన్యలు పూర్ణ కుంభాలతో సునామ జకినీ మాత ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పూర్ణ కుంభాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ సునామ జకినీ మాత ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షలు నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆరె కటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌రావు, సాయి సుభాష్ బాబు, బాబు రావు, రామచంద్ర రావు పాల్గొన్నారు.

ట్యాబ్ వాడడం తెలీదా?

- డీఈఓకే అవగాహన లేకపోతే ఎలా?
- మీకంటే విద్యార్థులే నయం
- డీఈఓ మీనాక్షిపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- చిలమత్తూరు బీసీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



డీఈఓ మీనాక్షిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

చిలమత్తూరు: ట్యాబ్‌ల వినియోగంపై కనీసం అవగాహన లేకపోవడం ఏంటని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ డీఈఓ మీనాక్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం రాత్రి చిలమత్తూరులోని బీసీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. ఎంత సమయం వినియోగించారు, పాఠశాలలో ఈరోజు ఏమి నేర్చుకున్నారంటూ ఆరా తీశారు. ఈ క్రమంలో మీకు ట్యాబ్ వాడడం వస్తుందా అని డీఈఓ మీనాక్షిని ప్రశ్నించారు. రాదని ఆమె తెలపడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అత్యంత సంపన్న దేశాలు కూడా చేయని సాహసం జగన్ సర్కార్ చేసిందని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా బైజూస్‌తో ఒప్పందం చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని, అలాంటప్పుడు జిల్లాలో ఏడు వేల మంది ఉపాధ్యాయులకు అథారిటీగా ఉన్న డీఈఓకు ట్యాబ్‌పై అవగాహన లేకపోవడం ఏంటని మండిపడ్డారు. ట్యాబ్ నేర్చుకోవడానికి కనీసం పది నిమిషాలు కేటాయించపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. బాధ్యతాయుతమైన పదవి భారంలా చూడటం తగదన్నారు. ఎంఈఓ నాగరాజుకు ట్యాబ్ అందించి విద్యార్థులు ఎంత సమయం వినియోగించారో చెప్పాలన్నారు. ఆయన కూడా ట్యాబ్‌ను ఆపరేట్ చేయలేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యాన్ని సహించబోనని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన వారు ఈ నెల 10 నుంచి 12 వరకు కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఇన్‌చార్జ్ కార్యదర్శి పూలప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలుర జట్టు : షౌకత్‌వలి, అవినాష్, కుమార్, సుధీర్, రాహుల్, విజయ్, ఆకాష్‌రెడ్డి, హర్షవర్ధన్, గణేష్, గిరీష్‌వర్ధన్, శ్రీనాథ్‌రెడ్డి, సాయితేజ

బాలికల జట్టు : బి.జ్యోత్స్నా, స్వాతి, ప్రవల్లిక, పూజిత, మీనా, హిమబిందు, రోషిని, హసీనా, తీర్థా, నందినిబాయ్, భారతిబాయ్, సబీనా, సుహాసిని, జోష్న, మైత్రి, మమత, నాగదీప్తి

తప్పించుకు తిరుగుతున్న దొంగ అరెస్ట్



అరెస్టు చేసిన దొంగను చూపుతున్న త్రీటౌన్ పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 24 ఏళ్ల వయసు..22 చోరీ కేసుల్లో నిందితుడు. 2019 నుంచి ఇప్పటి దాకా అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాలుగు చోరీ కేసుల్లో అరెస్టు అయిన శికారీ అర్జున్ బెయిల్‌పై బయటకు వచ్చి కనిపించకుండా పోయాడు. దీంతో కోర్టు వారెంట్లు పెండింగ్ పడ్డాయి. అతడి కదలికలపై నిఘా ఉంచిన త్రీటౌన్ పోలీసులు ఎట్టకేలకు అతన్ని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ... నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన శికారీ అర్జున్‌పై 2016 నుంచి ఇప్పటి దాకా 22 దొంగతనాల కేసులు ఉన్నాయి. త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు చోరీలు చేశాడు. ఈ నాలుగు కేసులకు సంబంధించిన వారెంట్లు పెండింగులో ఉన్నాయి. ఎస్పీ ఫక్కీరప్ప దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి తక్షణం నిందితులను కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించారు. అందులో భాగంగా శికారీ అర్జున్‌ను అరెస్టు చేసి అనంతపురం మొబైల్ కోర్టు ముందు శుక్రవారం హాజరుపరిచామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

5న సత్యదేవుడి వేడుకలు

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. విశేష పూజలు, సామూహిక సత్యదేవుడి వ్రతాల్లో పాల్గొనదలిచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సుజాత తెలిపారు. శుక్రవారం మండలంలోని ముట్టాల గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. గ్రామాల్లో కూలీలు పనులకు వచ్చేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేశారు.

విధుల్లో విమర్శలకు తావివ్వకండి



డైరీ ఆవిష్కరిస్తున్న సర్వే శాఖ ఏడీ కిశోర్‌బాబు, సిబ్బంది

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో విమర్శలకు తావివ్వకుండా అప్రమత్తతతో పని చేయాలని సర్వే, భూ రికార్డుల శాఖ ఉద్యోగులకు ఆ శాఖ ఏడీ కిశోర్‌బాబు సూచించారు. సర్వే ఉద్యోగుల సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీసర్వేలో గ్రామ సర్వేయర్లు చేయాల్సిన పనులపై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, వేణుగోపాల్ గుప్త, వెంకట చిన్నయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రఘునాథ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దనకు చెక్కును అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 1989–93 బ్యాచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు చేయూతనందించారు. శుక్రవారం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దనకు పూర్వ విద్యార్థులు మొత్తాన్ని అందించారు. శిల్పా హాస్టల్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలని పూర్వ విద్యార్థులు వీసీని కోరారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారం వర్సిటీ ప్రగతికి దోహదం చేస్తుందని వీసీ అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్లు ప్రొఫెసర్ వి.సుమలత, ప్రొఫెసర్ శోభాబిందు, ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి, ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, పూర్వ విద్యార్థులు రాఘవేంద్ర, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి

రాప్తాడు: విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం గొందిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మపై విధులకు సక్రమంగా రావడంలేదని గ్రామస్తులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసమయంలో అంగన్‌వాడీ కార్యకర్త సెంటర్‌లో కనిపించలేదు. అంగన్‌వాడీ కార్యకర్తపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రేపు వారపు సంత ప్రారంభం

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఆదివారం నుంచి ప్రతి ఆదివారం వారపు సంత నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుబ్బర హేమలత శుక్రవారం తెలిపారు. శుక్రవారం సంత ఏర్పాటు చేసే ప్రదేశంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జేసీబీతో శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులతో ఈ వారపు సంత నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిపై వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీలోని చంద్రబాబునగర్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులకు ప్రజల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధిలేదన్నారు.

నగరంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి : టీడీపీ అధికారంలో ఉండగా ఐదేళ్లపాటు కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. వర్గపోరుతో నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు వెయ్యి కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నగరంలో ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం, గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. అనంతపురం నగరంతో పాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రుద్రంపేట పంచాయతీలో గతంలో ఏ కాలనీ చూసినా మురుగు కూపాలుగా ఉండేవన్నారు. దాదాపు రూ. 2 కోట్లతో రుద్రంపేట పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎంపీటీసీలు మహబూబీ, లక్ష్మీనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సాదిక్‌వలి, గోవింద్‌రెడ్డి, గౌస్‌బేగ్, కుల్లాయప్ప, కృష్ణవేణి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



సిబ్బందికి సూచనలు అందిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఆదిమూర్తి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన ఫ్రైడే డ్రై డేను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ ప్రతి ఇంట్లోనూ ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ప్రధానంగా జ్వర సర్వే దోమల లార్వా, గుర్తింపు తొలగింపు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నూర్‌బాషా, శేఖర్, నాగేంద్రమ్మ, వరలక్ష్మి, శానిటేషన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్కేయూలో అగ్ని ప్రమాదం

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇస్రో ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం వద్ద శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశోధన కేంద్రం పక్కన ఉన్న ఎండు గడ్డిలో మంటలు చెలరేగాయి. దీంతో హుటాహుటిన పరిశోధన విద్యార్థులు, ఉద్యోగులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజిన్‌తో మంటలు పూర్తిగా ఆర్పివేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పెద్దఎత్తున ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్న అధికారులను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అభినందించారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకానికి ఏటా బడ్జెట్‌లో భారీగా కోత విధిస్తూ కూలీలకు అన్యాయం చేస్తోందన్నారు. 2021–22 బడ్జెట్‌లో రూ.98 వేల కోట్లు కేటాయించారన్నారు. రూ.25 కోట్లు తగ్గిస్తూ 2022–23 బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుత బడ్జెట్లో రూ.13 వేల కోట్లు కోత విధించి రూ.60 వేల కోట్లు కేటాయించారన్నారు. పథకానికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజు కూలీ రు.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నంగప్ప, బండారు శివ, శ్రీనివాసులు, సీళపాల రామకృష్ణ, వెంకటనారాయణ, నారప్ప, మౌలాలి, రసూల్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి స్వాగతం పలికిన జెడ్పీచైర్‌పర్సన్



మంత్రి కాకాణితో కలసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అనంతపురంలో ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటన కోసం శుక్రవారం రాత్రి అనంతపురం చేరుకున్న మంత్రికి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రికి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని పరిస్థితులపై జెడ్పీచైర్‌పర్సన్ మంత్రితో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఇతర శాఖల అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించండి

– అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్



పంపనూరులో స్థానికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఆత్మకూరు: ప్రజా సమస్యలను తక్షణమే స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పంపనూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం పథకాలకు సంబంధించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులకు పథకాలు అందకుంటే ఏమి చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం పంపనూరు తండా, సింగంపల్లి తండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సుస్థిర అభివృద్ధిలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని , మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూసంరక్షణతోనే భావితరాల మనుగడ

• విద్యార్థులతో ఎస్‌టీఎల్ ఏడీఏ రోజాపుష్పలత



భూసార పరీక్షలు, ప్రాధాన్యతపై చెబుతున్న ఎస్‌టీఎల్ ఏడీఏ రోజాపుష్పలత, ఏవోలు

అనంతపురం అగ్రికల్చర్: నేల, నీటి సంరక్షణ మీదనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందని స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ-ఎస్‌టీఎల్) ఏడీఏ రోజా పుష్పలత తెలిపారు. శుక్రవారం నేషనల్ సాయిబాబా కళాశాల విద్యార్థి బృందం పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. మట్టి నమూనాలు సేకరణ, భూసార పరీక్షలు, వాటి ప్రాధాన్యత, ఫలితాలు, వాటి ఆధారంగా పోషక యాజమాన్యం తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాష్ (ఎన్–పీ–కే) లాంటి స్థూల పోషకాలు, జింక్, బోరాన్, ఐరన్, అల్యూమినియం, మాంగనీసు లాంటి సూక్ష్మపోషకాలు భూమిలో ఏ స్థాయిలో ఉన్నాయో ఎలా తెలుసుకోవడం, ధాతులోపాలను సేంద్రియ, రసాయన ఎరువుల వాడకం ద్వారా ఎలా పెంచుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను బాగా తగ్గించి ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ పోషకాల వాడకం తదితర వాటిని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే నేల, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవోలు నాగేంద్ర, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేయాలి



వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్ సిబ్బందిని అభినందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నడిమివంక వద్ద పైప్‌లైన్ మరమ్మతు పనులను మేయర్ వసీం శుక్రవారం పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని డీఈ నరసింహ, తదితర సిబ్బందిని మేయర్ ఆదేశించారు. నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పైప్‌లైన్ పనులు జరిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. కార్పొరేటర్ రహంతుల్లా, నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అంబులేటరీ సేవలు అభినందనీయం : గాయపడిన ఆవులు, గేదెలు, మూగజీవాలకు సత్వర వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్ 1962 సేవలు అభినందనీయమని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం కోవూర్‌నగర్‌లో రోడ్డుపై సంచరించే ఆవు గాయపడడంతో స్థానికులు 1962కు సమాచారం అందించారు. అటుగా వెళ్తున్న మేయర్ మొబైల్ క్లినిక్ వద్ద అందుతున్న సేవలను పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూగజీవాలకు సేవలందించాలన్న లక్ష్యంగా ప్రవేశపెట్టిన హెల్ప్‌లైన్ వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తోందన్నారు. కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.25 కోట్ల పనులకు తొలి అడుగులు : నగరంలోని వివిధ ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చిన రూ.25 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులకు తొలి అడుగులు పడనున్నాయి. నగరంలో 19 ప్యాకేజీల పనులకు నగరపాలక సంస్థ శనివారం నుంచి టెండర్లు ఆహ్వానించనుంది. అందుకు సంబంధించి ఇంజినీరింగ్ విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

మరమ్మతు పనులు పూర్తి : నడిమివంక వద్ద ఏర్పడ్డ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు పూర్తయినట్లు డీఈ నరసింహ తెలిపారు. ఈ నెల 2న పైప్‌లైన్‌కి లీకేజీ ఏర్పడిందని, తద్వారా గౌరవ గార్డెన్స్, 6వ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉన్న ట్యాంకులకు నీటి సరఫరా బంద్ అయ్యిందన్నారు. శుక్రవారం మరమ్మతు పనులు పూర్తయినట్లు తెలిపారు. ట్యాంకులకు నీరు సరఫరా అవుతుందా? లేదా అని ట్రయల్ రన్ నిర్వహించినట్లు తెలిపారు.

పాతూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి

అనంతపురం క్రైం: పాతూరు మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులను అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పాతూరు మార్కెట్, సూర్యనగర్ సర్కిల్, నీరుగంటి వీధి, తదితర ప్రాంతాల్లో అదనపు కమిషనర్ పర్యటించారు. సూర్యనగర్ సర్కిల్‌లో పుష్‌కాట్స్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. నిషేధిత ప్లాస్టిక్ సరఫరా జరగకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి, సంబంధిత వ్యాపారులకు ఫైన్ విధించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పారిశుధ్య కార్యదర్శులతో ఆయన మాట్లాడారు.

అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైనది భారతీ సిమెంట్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందిస్తున్న భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతీ సిమెంటనీ భారతీ సిమెంట్ కంపెనీ సేల్స్ మేనేజర్ మోతీలాల్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం టీవీ టవర్ సమీపంలోని రంగనాథ స్టీల్స్ ట్రేడర్స్ దగ్గర తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ సేల్స్ మేనేజర్ మోతీలాల్ మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతీ సిమెంట్ అన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ధరలో సిమెంట్ అందిస్తున్నామన్నారు. నిర్మాణాలు చేపట్టే చోట తాపీ మేస్త్రీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తాపీ మేస్త్రీలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో తమ కంపెనీ ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

అనంత కళాకారులకు కళాతపస్వితో అనుబంధం

అనంతపురం కల్చరల్: దిగ్గజ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్‌తో అనంత కళాకారులకు అనుబంధం ఉంది. ఆయన మరణవార్త విని కళాభిమానులు కంట తడిపెట్టారు. కె.విశ్వనాథ్ మరణం తీరని లోటని సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, నాట్యాచార్యులు సంధ్యామూర్తి అన్నారు. వేర్వేరు ప్రకటనలో విశ్వనాథ్‌తో తమ అనుబంధాన్ని ఆచార్య సుధాకర బాబు, నాట్యకళాకారిణి లాలిత్య, అనంత కళావాహిణి రమేష్‌నీల్, ఆదరణ రామకృష్ణ, శైలజ తదితరులు గుర్తు చేసుకున్నారు. 2016లో జిల్లా కేంద్రంలోని త్యాగరాజ గానసభకు, హంపాపురంలో ఆదరణ వ్యవసాయ క్షేత్రానికి ఆయన విచ్చేసి, సన్మానం పొందారన్నారు. కె.విశ్వనాథ్ జిల్లాకొచ్చిన సందర్భంలో విశాలాంధ్ర బుక్ హౌస్‌లో పుస్తకాలు కొనుగోలు చేశారని మాజీ బుక్‌హౌస్ మేనేజర్ చెట్ల ఈరన్న అన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

కనగానపల్లి: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సచివాలయ, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాలపై అధికారులు సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, వాటి ప్రణాళికలపై చర్చించారు. మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్యంపై ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి అధికారులు సూచనలు అందించారు. సమావేశంలో ఈఓఆర్డీ అనిల్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



ఏడీసీసీబీ డైరెక్టర్ మల్లన్నను సన్మానిస్తున్న బ్యాంక్ మేనేజర్

ఆత్మకూరు: ప్రజలు, రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మల్లన్న తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంక్‌లో ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పి.యాలేరు సొసైటీ బ్యాంకు చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ఆదేశాల మేరకు ఏడీసీసీ బ్యాంక్ స్థాపించి, 105 ఏళ్లయినందున కొందరు ఖాతాదారులను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ స్టీఫెన్ కుమార్, బ్యాంక్ సిబ్బంది నారప్ప, లక్ష్మిదేవి, లాస్య, హనుమంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.